# మావోయిస్టు పార్టీ సభ్యుడి అరెస్టు



రామగుండం కమిషనరేట్‌లో మావోయిస్టు అరెస్టు చూపుతున్న సీపీ రేమా రాజేశ్వరి

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 8 : సీపీఐ మావోయిస్టు పార్టీ కోల్‌బెల్టు ఏరియాలో తన ప్రాభవాన్ని పునరుద్ధరించుకునేందుకు చేసే ప్రయత్నంలో భాగంగా సికాస కార్యకలాపాలను విస్తరించడానికి గోదావరిఖనికి వచ్చిన పార్టీ సభ్యుడిని రామగుండం కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సీపీ రేమా రాజేశ్వరి శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నాదెళ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన మావోయిస్టు నక్సలైటు మామిడిమల్ల అవినాష్ అలియాస్ మల్లేశ్ (29) గురువారం రాత్రి ఒంటి గంటకు గోదావరిఖని పట్టణంలోని ఆర్జీ-1 ఏరియా జీఎం కార్యాలయం జంక్షన్ వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా చేతిలో సంచితో సీఎస్పీ కాలనీ వైపు వెళ్తూ కనిపించాడు. అనుమానస్పదంగా ఉండడంతో పోలీసులు అతడి వద్దకు వెళ్తుండగా వారిని చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతన్ని పట్టుకొని విచారించగా సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యుడిగా సికాస కార్యకలాపాలను విస్తరించడానికి పార్టీ ఆదేశాలతో గోదావరిఖనికి వచ్చినట్లు తెలిపాడు. నిందితుడు అవినాష్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, తన గ్రామంలో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతూ ఉండేవాడు. ఆ క్రమంలో కరపత్రాల ముద్రణ కోసం వచ్చిపోయేవారి పరిచయం ద్వారా సీపీఐ మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పడ్డాయి. పార్టీ భావజాలం పట్ల ఆకర్షితుడయ్యాడు. రెండేళ్ల క్రితం సీపీఐ పార్టీలో చేరి పని చేస్తున్నాడు. ప్రస్తుతం సికాస విభాగం ఆదేశాల మేరకు గోదావరిఖనిలో సికాస కార్యకలాపాలను విస్తరించే పనిలో గోదావరిఖనికి వచ్చాడు. ఈక్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడని, నిందితుడి వద్ద నుంచి వాల్ పోస్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు.



## కేసీఆర్ త్వరగా కోలుకోవాలని..

▲ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

- సాయిబాబా ఆలయంలో బీఆర్ఎస్ నాయకుల పూజలు

జ్యోతినగర్, డిసెంబర్ 8: బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు త్వరగా కోలుకోవాలని శుక్రవారం రామగుండం 20 డివిజన్‌లోని సాయిబాబా ఆలయంలో బీఆర్ఎస్ నాయకు లు పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ మాట్లాడారు. కేసీఆర్ సాధ్యమైనంత తొందరగా ప్రజా జీవితంలో కి వచ్చేలా అనుగ్రహించాలని సాయినాథుడిని వేడుకున్నట్లు చెప్పారు. ఇక్కడ నాయకులు కలవేని మల్లేశ్, స్వామి, లక్ష్మణ్, సారయ్య, రాజు, గణేశ్, శ్రీను,సంతోష్ తదితరులు ఉన్నారు.

### కోరుట్ల మాజీ ఎమ్మెల్యేకు అస్వస్థత

మెట్‌పల్లి, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో రెండు రోజుల కిందట చేరిన ఆయనకు గుండెకు సంబంధించి శస్త్రచికిత్స చేసి స్టంట్ వేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందని, ఒకటి రెండు రోజుల్లో దవాఖాన నుంచి డిశ్చార్జి అవుతారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సాయంత్రం తెలిపారు.

## హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి మిత్రుల సాయం

రాంనగర్, డిసెంబర్ 8 : గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ దేవయ్య విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో చనిపోయారు. పెద్దపల్లిలో శుక్రవారం బాధిత కుటుంబానికి 2000వ సంవత్సరం పోలీసు కానిస్టేబుల్ బ్యాచ్ మిత్రులు రూ.2.65 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంపత్ రెడ్డి, లక్ష్మీపతి, ఏలియా, సాంబరెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రులు

# ఆర్టీసీ బస్సుల్లో నేటి నుంచి ఫ్రీ జర్నీ

- పల్లెవెలుగు, మినీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లో మహిళలకు ఉచితం
- రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించే అవకాశం
- గుర్తింపు పత్రం తప్పనిసరి
- కరీంనగర్ ఆర్ఎం సుచరిత

తెలంగాణచౌక్, డిసెంబర్ 8 : టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో నేటి (ఈనెల 9వ తేదీ) మధ్యాహ్నం నుంచి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని కరీంనగర్ రీజియన్ మేనేజర్ సుచరిత తెలిపారు. ఈ మేరకు సదుపాయాన్ని కల్పిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. కరీంనగర్ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. డిపో-2లో శనివారం ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. పల్లెవెలుగు, మినీ పల్లెవెలుగుతోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఏ ప్రాంతానికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ సౌకర్యం కేవలం తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ప్రయాణ సమయంలో మహిళలు రాష్ట్రానికి చెందిన వారుగా ఏదైనా గుర్తింపు పత్రం చూపించాల్సి ఉంటుందన్నారు. ఉచిత ప్రయాణంలో సమస్యలు ఎదురైతే డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

# తనయుడి చేతిలో తండ్రి హతం

- పనిచేయాలన్నందుకు తలపై బండరాయితో బాది హత్య
- సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాలలో దారుణం



నిందితుడు తీగల రాజేశ్ (ఫైల్)

సుల్తానాబాద్, డిసెంబర్ 8: అవసాన దశలో అలనాపాలన చూడాల్సిన కొడుకే తన తండ్రిని హతమార్చాడు. పనిచేయాలని మందలించిన పాపానికి తలపై బండరాయితో బాది కిరాతకంగా చంపేశాడు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాలలో ఈ దారుణ ఘటన జరిగింది. సీఐ జగదీశ్, ఎస్ఐ విజేందర్ వివరాల ప్రకారం.. తీగల నర్సయ్య (60)కు ఇద్దరు కొడుకులు, కూమార్తె ఉన్నారు. పెద్ద కొడుకు రాజేశ్(40)కు పెళ్లికాలేదు. చిన్న కొడుకు, కూతురుకు పెళ్లిళ్లు అయ్యాయి. ఇక్కడ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు పూసాలలోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లారు. వర్షం పడే అవకాశం ఉండడంతో తండ్రి నర్సయ్య ధాన్యాన్ని కుప్పగా చేయాలని కొడుకు రాజేశ్ చెప్పాడు. దీంతో విసుగు చెందిన రాజేశ్.. 'నాకే పనిచెబుతావా..' అంటూ తండ్రితో గొడవకు దిగాడు. కోపోద్రిక్తుడైన రాజేశ్ అక్కడే ఉన్న బండ రాయితో తండ్రి నర్సయ్య తలపై గట్టిగా కొట్టడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. కిందిపడిపోయిన తర్వాత తలపై మరోసారి బండరాయితో కొట్టడంతో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లి భూదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు రాజేశ్‌ను పోలీసుల అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే నర్సయ్య స్వగ్రామం కాచాపూర్‌లో జరిగిన హత్య కేసులోనూ రాజేశ్ నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో పూసాలకు వచ్చి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు.

# శుభకార్యానికి వెళ్లొస్తూ మృత్యు ఒడికి

- అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్న బైక్
- అక్కడికక్కడే యువకుడు దుర్మరణం
- మరొకరికీ తీవ్రగాయాలు.. దవాఖానకు తరలింపు
- ధర్మారంలో ఘటన.. కోనరావుపేటలో విషాదం



సంజయ్ (ఫైల్)

కోనరావుపేట, డిసెంబర్ 8: శుభకార్యానికి వెళ్లొస్తున్న యువకుడు మృత్యు ఒడికి చేరాడు. బైక్‌పై వస్తూ కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. శుక్రవారం కోనరావుపేట మండలం ధర్మారంలో జరిగిన ఘటనతో కోనరావుపేటలో విషాదం అలుముకున్నది. ఎస్ఐ అంజనేయులు వివరాల ప్రకారం.. కోనరావుపేటకు చెందిన దండు రవి, లత దంపతులకు ఇద్దరు కొ డుకులు సాయిచరణ్ (25), సంజయ్ (22) ఉన్నారు. రవి నాలుగేండ్ల కిందట ఆత్మహత్య చేసుకోగా, తల్లి బీడీలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నది. సాయిచరణ్ బీటెక్ పూర్తిచేసి ఇంటి వద్దనే గతంలో తండ్రి నిర్వహించిన మెడికల్ షాపును నడిపిస్తున్నాడు. సంజయ్ గతేడాదే డిగ్రీ పూర్తిచేసి, అన్నతో మెడికల్ షాపులో ఉంటున్నాడు. గురువారం మర్తనపేటలో తన ఫ్రెండ్ పెండ్లి ఉండడంతో సంజయ్ తన బైక్‌పై మరో ఫ్రెండ్ గాజుల వినయ్‌తో కలిసి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా ధర్మారం శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సంజయ్ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మరణించాడు. గాజుల వినయ్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తోటి స్నేహితులు వినయ్‌ను కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. సంజయ్ మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ దవాఖనకు తరలించారు. మృతుడి పెద్దనాన్న, వినయ్ మేనమామ సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గతంలో మృతుడి తండ్రి రవి ఆత్మహత్య చేసుకోగా, చిన్నాన్న అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో సంజయ్ మృతదేహానికి చిన్నమ్మ తలకొరివి పెట్టడాన్ని చూసి పలువురు తల్లడిల్లారు. కాగా, సంజయ్ మరణంతో తల్లి, సోదరుడు హృదయవిదారకంగా రోదించారు.

## గంజాయి పట్టివేత

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 8 : గోదావరిఖని పట్టణం పరశురాంనగర్‌లో అక్రమంగా గంజాయి కలిగి ఉన్న ఎండీ గౌస్ పాషాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పరశురాంనగర్‌లోని ఒక ఇంట్లో గంజాయి ఉన్నదనే సమాచారంతో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేయగా 450 గ్రాములు లభించింది. దీని విలువ సుమారు రూ.10 వేల వరకు ఉంటుంది. మహారాష్ట్రలోని బల్హార్షా నుంచి గంజాయి కొనుగోలు చేసి గోదావరిఖనిలో యువతకు అమ్ముతున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★కరీంనగర్‌లోని రెనె హాస్పిటల్ ప్రక్కన వున్న వాటర్ ప్లాంట్‌లో పనిచేయుటకు వర్కర్, డ్రైవర్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. సంప్ర|| సెల్ : 7981054327, 7093413912.
NTK-316688

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-314356-All

PLOT FOR SALE



★Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199.
NT-313050

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

